## రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతాం:పొంగులేటి



హైదరాబాద్, మార్చి 24(నమస్తే తెలంగాణ): హైడ్రాతో పాటు అస్తవ్యవస్థ విధానాలతో రాష్ట్ర రియల్ రంగాన్ని దెబ్బతీసిన సర్కారు ఇప్పుడు మరో పిడుగు వేసింది. త్వరలోనే రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేందుకు సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి భూభారతి అమల్లోకి తెచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు.

**నాకు అనిరుధ్‌రెడ్డికి ఏ సమస్య లేదు**

సొంత పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తొలిసారి స్పందించారు. తనకు అనిరుధ్‌రెడ్డికి మధ్య ఏ సమస్య లేదని స్పష్టంచేశారు. అసలు అనిరుధ్‌రెడ్డి చెప్పే అభిమన్యురెడ్డి ఎవరో కూడా తనకు తెలియదని పేర్కొన్నారు.

## జీపీ సిబ్బందికి జీతాలేవి?

**అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని**



హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : గ్రామపంచాయతీ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలివ్వడం లేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బడ్జెట్ పద్దులపై చర్చలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బందికి వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'బీఆర్‌ఎస్ హయాంలో పలు గ్రామాల్లో వైకుంఠ ధామాలు నిర్మించారు. మిగతా గ్రామాల్లోనూ వాటిని నిర్మించాలి. ఎస్సీ సబ్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలుచేయాలి. గిరిజనుల్లోనూ ఏ,బీ,సీ,డీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు.

## 30 ఏండ్లలో ఇంతటి నీటిఎద్దడి చూడలే: శంకర్



హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కరువుఛాయలు తీవ్రంగా అలుముకున్నాయని, ప్రజలు తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గత 30 ఏండ్లలో ఇంతటి నీటిఎద్దడి చూడలేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అసెంబ్లీలో ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రజలకు నీటిని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో మహిళా సంక్షేమం పెరగాలంటే.. ఎక్సైజ్ ఆదాయం తగ్గాలని పేర్కొన్నారు.

## పంచాయతీరాజ్ (సవరణ) బిల్లు-2025కి ఆమోదం



హైదరాబాద్, మార్చి 24 (నమస్తేతెలంగాణ): తెలంగాణ పంచాయతీరాజ్(సవరణ) బిల్లు-2025కి అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని 79 గ్రామపంచాయతీలను షెడ్యూల్ 8 తొలగించి పురపాలికలలో విలీనం చేయాలనే ప్రతిపాదన బిల్లును పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీలో సోమవారం ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కోవ లక్ష్మి, కాంగ్రెస్ సభ్యులు భూపతిరెడ్డి, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల చట్టం సవరణ బిల్లుకు ఆమోదం

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : మున్సిపాలిటీల చట్టం సవరణ బిల్లుకు సోమవారం రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా కొన్ని గ్రామాలను మున్సిపాలిటీల్లో చేర్చడం, మరికొన్నింటిని తొలగించడం వంటి పలు సవరణలు ఉన్నాయి. ముఖ్యంగా మేయర్, డిప్యూటీ మేయర్, చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌ల ఎన్నికలో రాజ్యసభ సభ్యులకు ఓటుహక్కు కల్పించారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సమీపంలోని పలు గ్రామాలను విలీనం చేయడంతో కొత్తగా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటైంది.

## అవయవాల మార్పిడి చట్టం అమలుకు తీర్మానం

హైదరాబాద్, మార్చి 24(నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వ మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం-1994ను తెలంగాణలో అనుసరించేందుకు ఉద్దేశించిన తీర్మానాన్ని శాసనసభ సోమవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. చికిత్స ప్రయోజనాలు, మానవ అవయవాల తొలగింపు, నిల్వ, మార్పిడిని నియంత్రించి మానవ అవయవాలతో వాణిజ్య లావాదేవీలను నిరోధించడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశం.

## బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు రూ.లక్ష విరాళం



ఏప్రిల్ 27న ఓరుగల్లులో జరిగే బీఆర్‌ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ వేడుకల ఖర్చులకు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) గ్రామస్థులు రూ.1,02,003 విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ముక్రా (కే) గ్రామంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందినట్టు తెలిపారు. అందుకే ఓరుగల్లులో నిర్వహించే బహిరంగ సభకు విరాళం ప్రకటించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు సదరు మొత్తాన్ని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పంపించాలని కోరుతూ మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మీనాక్షి మాట్లాడుతూ.. నాటి జల దృశ్యం నుంచి నేటి వరకు కేసీఆర్ వెంటే ఉన్నామని తెలిపారు. కేసీఆర్ అడుగుజాడల్లోనే నడుస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్ తదితరులు పాల్గొన్నారు. -ఇచ్చోడ

# తోఫా ఇవ్వకుండా కాంగ్రెస్ ధోకా

- మైనార్టీలకు చేసిందేమీలేదు
- హామీలను విస్మరించి పచ్చి దగా
- కేసీఆర్ పాలనలోనే గౌరవం
- బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- తెలంగాణ భవన్‌లో ఇఫ్తార్
- తరలివచ్చిన ముస్లింమైనార్టీలు



తెలంగాణ భవన్‌లో ఇఫ్తార్ విందులో కేటీఆర్‌కు ఖర్జూరం తినిపిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మైనారిటీ నేతలు

హైదరాబాద్, మార్చి 24 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ 15 నెలల పాలనలో తోఫా ఇవ్వకుండా ముస్లిం మైనార్టీలకు ధోకా చేసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. షాదీముబారక్ కింద రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని మాట తప్పిందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ వేడుకలు నిర్వహించారు. డిప్యూటీ మాజీ సీఎం మహమూద్ అలీ, మాజీ మంత్రి వీ.శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి కేటీఆర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముస్లిం మతపెద్దల సమక్షంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం వారికి ఖర్జూర్ తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ పదేండ్ల పాలనలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని చెప్పారు. హిందువులతోపాటు ముస్లింలు, క్రిస్టియన్ల పండుగలకూ పేద కుటుంబాలకు బట్టలు పెట్టి గౌరవించారని గుర్తుచేశారు. గురుకులాలు నిర్మించి వారి పిల్లలకు నాణ్యమైన విద్యనందించిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలవుతున్నా మైనార్టీలకు మంత్రివర్గంలో స్థానమే కల్పించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. నాడు మైనార్టీల ఓట్ల కోసం అడ్డగోలు వాగ్దానాలు చేసిన కాంగ్రెస్, నేడు వారికి నిధులు కేటాయించకుండా నిండా ముంచుతున్నదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా హామీల అమలుపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. లేదంటే కేసీఆర్‌ను సంప్రదించి భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు మసియుల్లాఖాన్, సలీం, ఖలీం, వజీరుద్దీన్, మాజిద్‌ఖాన్, అక్బర్, షేక్ అబ్దుల్, యూసుఫ్, ఇమాంఖాన్, వకార్ తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ కడుపులో పెట్టుకొని చూసుకున్నరు: మహమూద్ అలీ

పదేండ్లు తెలంగాణను పాలించిన కేసీఆర్ ముస్లిం మైనార్టీలను కడుపులో పెట్టుకొని చూసుకున్నరని మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ కొనియాడారు. 'ఏటా రంజాన్ పండుగకు తోఫా ఇచ్చి గౌరవించేవారు. మైనార్టీ గురుకులాలను ఏర్పాటుచేసి ముస్లిం పిల్లలకు మెరుగైన విద్యనందించారు. పెండ్లి చేసుకున్న ఆడబిడ్డలకు షాదీముబారక్ కింద రూ.లక్ష అందించి ఆర్థిక చేయూతనందించారు' అని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలనే విస్మరించి మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని విమర్శించారు.



హైదరాబాద్ కోఠిలోని డీఎంహెచ్‌వో ఎదుట ఆందోళనకు దిగిన ఆశా కార్యకర్తలను అరెస్ట్ చేసి బలవంతంగా ఈడ్చుకెళ్తున్న పోలీసులు

## ఆశాల నిరసన గళం..
# పోలీస్ జులుం

- కోఠి డీహెంఎంహెచ్‌వో ఆఫీసు వద్ద ఆందోళన ఉద్రిక్తం
- బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలింపు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన ఆశాలు
- రాష్ట్రవ్యాప్తంగా నిర్బంధాలు, ఎక్కడికక్కడ అరెస్టులు

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగిన ఆశా కార్యకర్తలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. సోమవారం రాష్ట్రనలు మూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు హైదరాబాద్‌లోని కోఠి డీఎంహెచ్‌వో ఎదుట ఆందోళనకు దిగారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. మహిళలను మగ పోలీసులు తాళ్లతో నెట్టేశారు. బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్లలోకి ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులను ఆశా కార్యకర్తలు ప్రతిఘటించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆశ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. తెల్లవారుజామునే ఆశా కార్యకర్తల ఇండ్లలోకి వెళ్లి నిర్బంధించారు. చాలామందిని బలవంతంగా వ్యాన్లలో ఎక్కించి, స్టేషన్లకు తరలించారు.

**వేతన హామీని నిలబెట్టుకోవాలి**

ధర్నా సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు రూ.18వేల వేతన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నిత్యం తీవ్రంగా శ్రమిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పెడచెవిన పెట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రులు, ఉన్న తాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోయారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని విరుచుకుపడ్డారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**నిర్బంధమే ఇందిరమ్మ రాజ్యమా?: హరీశ్‌రావు**

న్యాయమైన డిమాండ్ల సాధన లక్ష్యంగా ఆందోళనకు దిగిన ఆశా కార్యకర్తలను అరెస్ట్ చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "వేతనాలు పెంచాలని అడగడమే వారు చేసిన నేరమా? ఆశా సోదరీమణులంటే ఎందుకింత విద్వేషం.. నిరంకుశత్వం..? ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవం ఇదేనా?" అని సోమవారం ఎక్స్ వేదికగా ప్రశ్నాస్త్రాలు సంధించారు. గొంతెత్తిన వారిని అక్రమంగా అరెస్ట్ చేస్తూ కాంగ్రెస్ సర్కారు అప్రజాస్వామిక పాలన సాగిస్తున్నదని నిప్పులు చెరిగారు. ఆశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



- **సస్పెన్షన్‌పై బులెటిన్ విడుదల చేయండి**

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): తన సస్పెన్షన్‌కు సంబంధించిన అధికారిక బులెటిన్‌ను విడుదల చేయాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. అధికార పార్టీ చెప్పడంతో శాసనసభ సమావేశాల నుంచి తనను సస్పెండ్ చేశారని, కానీ దానిపై ఇప్పటి వరకు అధికారిక బులెటిన్ విడుదల కాలేదని పేర్కొన్నారు. అందుకోసం తాను శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులును సంప్రదించినా స్పందన లేదని చెప్పారు. 'గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగం సందర్భంగా నేను మీ (స్పీకర్) పట్ల అమర్యాదగా ప్రవర్తించలేదు. ఏకవచన ప్రయోగం చేయలేదు. ప్రభుత్వం నాపై దురుద్దేశపూర్వకంగా, సస్పెన్షన్ తీర్మానం ప్రవేశపెట్టింది' తెలిపారు.

## ఇచ్చిన మాట మరిచిన మంత్రి

- ప్రజావాణిలో జనం గంటల పాటు పడిగాపులు
- వినతులు స్వీకరించని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజలు

నల్లగొండ, మార్చి 24: కలెక్టరేట్‌లో ఈ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో పాల్గొని వినతులు స్వీకరిస్తానని ఇటీవలే మాటిచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డే ఆ మాట తప్పారు. నల్లగొండ జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులను గంటల తరబడి వేచి ఉంచారు. 12 గంటలకు వస్తానన్న మంత్రి మధ్యాహ్నం ఒకటిన్నరకు వచ్చి కనీసం ప్రజావాణి మందిరానికి కూడా రాకుండానే వెళ్లిపోయారు. దీంతో బాధితుల తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. మంత్రి నల్లగొండలోని ఆర్జాలబావి, తిప్పర్తి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మధ్యాహ్నం ఒకటిన్నరకు కలెక్టర్ చాంబర్‌కు వచ్చారు. గంటపాటు చాంబర్‌లోనే ఉన్న మంత్రి ప్రజావాణి సమావేశ మందిరంలోకి రాకుండానే వెళ్లిపోయారు. అప్పటివరకూ వేచి ఉన్న బాధితులు మంత్రి వైఖరిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వెళ్లిన తర్వాత కలెక్టర్ ఇలా త్రిపాఠి వినతులను స్వీకరించగా, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు సాయంత్రం 4 గంటల వరకు కార్యాలయ ఆవరణలోనే తిండి తిప్పలు లేకుండా ఉండాల్సి వచ్చింది.

## 40వ సారి ఢిల్లీకి సీఎం

హైదరాబాద్, మార్చి24(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 40వసారి ఢిల్లీకి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితోకలిసి సీఎం ఢిల్లీ వెళ్లారు. ఈసారి పర్యటన మంత్రివర్గ విస్తరణ కోసమేనని గాంధీ భవన్ వర్గాలు మీడియాకు లీకులు ఇచ్చాయి. మంత్రివర్గ విస్తరణపై ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు, సంప్రదింపులు జరిపిన అధిష్ఠానం ఈ సారి తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

**సీఎం జపాన్ పర్యటన ఖరారు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన ఖరారైంది. ఏప్రిల్ రెండో వారంలో సీఎం రేవంత్‌రెడ్డి వారం రోజుల పాటు జపాన్‌లో పర్యటించనున్నారు.

## రుణమాఫీ బూటకం.. కాంగ్రెస్ నాటకం

- అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల నిరసన
- నల్లబ్యాడ్జీలతో హాజరైన సభ్యులు
- రాష్ట్రవ్యాప్తంగా రైతు ఆందోళనలు
- ఎక్కడికక్కడ అడ్డగింత.. అరెస్టులు

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా రైతాంగాన్ని మోసం చేసిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నిరసకు ఉపక్రమించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ అసెంబ్లీలోకి వచ్చారు. ఈ సందర్భంగా 'రుణమాఫీ బూటకం, కాంగ్రెస్ నాటకం, రుణమాఫీ అరకొర, కాంగ్రెస్ కొరకొర, మాట తప్పిన కాంగ్రెస్ డౌన్ డౌన్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పి, గద్దెనెక్కిన తర్వాత తప్పించుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. నల్లబ్యాడ్జీలతోనే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు.

**అన్నదాతల ఆందోళనలు భగ్నం**

రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీ ముట్టడి కోసం బయల్దేరిన రైతులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. ఆటోలో అసెంబ్లీ వద్దకు చేరుకున్న పలువురు రైతులను పోలీసులు గేటు వద్ద అడ్డుకున్నారు. బలవంతంగా అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. ప్రభుత్వ తీరుపై రైతు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. మాట తప్పిన కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ చెప్పిన పథకాల సంగతేమైంది?

- డిక్లరేషన్ల స్కీమ్స్ అమలు చేయండి
- సర్కారును నిలదీసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు వచ్చిందని, పథకాలను ప్రభుత్వం ఎప్పట్నుంచి అమలు చేస్తుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రశ్నించారు. నిలదీశారు. శాసనసభలో సోమవారం బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఊహాగానాల నుంచి భూమ్మీదకు వచ్చి.. పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 6 లక్షల మంది యువతులకు కల్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఎప్పుడిస్తారని నిలదీశారు.



**కామారెడ్డి డిక్లరేషన్ ఏమైంది?**

బడ్జెట్‌లో బీసీలకు రూ.20,000 కోట్లు కేటాయిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.11,405 కోట్లు మాత్రమే కేటాయించిందని సునీతాలక్ష్మారెడ్డి దుయ్యబట్టారు. రెండోవిడత గొర్రెల పంపిణీ, చేప పిల్లల ఉచిత పంపిణీ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. చేనేత పరికరాలకు సంబంధించి 90 శాతం రాయితీ ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. పింఛన్‌ను రూ.4000కు ఎప్పుడు పెంచుతారని ప్రశ్నించారు. ఎంఎంటీఎస్ రైలులో మహిళపై అత్యాచారయత్నం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలనలో మహిళలపై క్రైమ్ రేట్ 28 శాతం పెరిగిందని మండిపడ్డారు.

**నాకే వినాలపిస్తలేదు..!**

'నాకే వినాలనిపిస్తలేదు.. మరి వాళ్లు (అధికార పక్షం) ఎట్లా వింటున్నారో నాకు తెల్వదు' అంటూ స్పీకర్ ప్రసాద్ అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాట్లాడుతుండగా మైక్ కట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీలో సోమవారం సాయంత్రం శాసనసభలో మహిళా భద్రత అంశంపై నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతుండగా ఈ ఘటన జరిగింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు చేపట్టిన పథకాలను, శాంతిభద్రతల పటిష్టతకు అనుసరించిన విధానాలను, రాష్ట్రంలో చేపట్టిన పలు పథకాల గురించి సునీత వివరిస్తుండగా మైక్‌ను కట్ చేసిన సభాపతి మిగిలిన సభ్యులను చూపుతూ పై వ్యాఖ్యలు చేశారు.

## కేసీఆర్ సాబ్ దిల్‌వాలే సీఎం

మొదటిపేజీ తరువాయి...

పేరిట వేధిస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా నదుల్లో నీళ్లున్నా, నీటి వనరులు పుష్కలంగా ఉన్నా గ్రామాలు దాహార్తితో ఎందుకు తల్లడిల్లుతున్నాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో కనీసం రంజాన్ మాసంలోనైనా తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూములను కాపాడాలని కోరారు. దళితబంధు ఎక్కడా? అంటూ అక్బరుద్దీన్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిరుడు దళితబంధు కింద రూపాయి ఖర్చుచేయలేదని, అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని ప్రకటించినా పైసా ఇవ్వలేదని గుర్తుచేశారు. వీధి వ్యాపారులకు రక్షణ కరువైందని, సర్కారు తీరుతో 20 లక్షల మంది రోడ్డునపడ్డారని ఆందోళన వ్యక్తంచేశారు. రేషన్‌కార్డు లేకుండా రాజీవ్ యువవికాసం పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలని అక్బరుద్దీన్ ప్రశ్నించారు.

# కక్షతోనే కాళేశ్వరాన్ని ఎండబెట్టిన్రు

- మైనర్ రిపేర్ చేయకుండా రైతులను నిలువునా ముంచిన్రు
- గోదావరిని ఎండబెట్టిన సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్
- గోదావరిఖనిలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం
- కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



గోదావరిఖని చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు కోరుకంటి చందర్, చిత్రంలో నేతలు, కార్యకర్తలు

పెద్దపల్లి, మార్చి 24(నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందనేది పూర్తిగా అబద్ధమని బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్‌పై ఉన్న కక్షతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును ఎండబెట్టిందని విమర్శించారు. మైనర్ రిపేర్లు చేపట్టకుండా ప్రభుత్వం ఇటు రైతన్నలు, అటు ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. సోమవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రధాన చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణను కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుతో రామగుండం, మంథని, మంచిర్యాల, చెన్నూరు గోదావరి తీరం నాడు నిండుకుండలా ఉండేదని, అలాంటి గోదావరి కాంగ్రెస్ కుట్రతో నేడు ఎడారిగా మారిందని అన్నారు. గోదావరిని ఎండబెట్టి రైతుల కన్నీళ్లకు కారణమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైందని అన్నారు. కాళేశ్వరం విషయంలో పెద్ద తప్పు చేసిన రేవంత్‌రెడ్డి వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ ఎన్నికల హామీలను నెరవేర్చాలి

- లేకుంటే సమ్మెకు వెనుకాడబోం
- రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 24(నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే సమ్మెకు దిగేందుకు వెనుకాడబోమని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాయికోటి రాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే డీలర్ల సమస్యలను పరిష్కరిస్తామని, క్వింటాల్ బియ్యంపై కమీషన్‌ను రూ.300లకు పెంచడంతోపాటు రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తామని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి 15 నెలలైనా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంత్రులు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.